ప్రజాశక్తి
సోమవారం 28 జూలై, 2025
5
శ్రీకాకుళం

ఆకాశం ఎర్రబడింది

ఆదివారం సంధ్యాకాల సమయంలో ఆకాశం ఎరుపు రంగులోకి మారగా, అందులోనే నెలవంక ఆకాశానికి తిలకం దిద్దినట్టుగా కనిపించిన ఈ దృశ్యం ప్రకృతి ప్రేమికులను కట్టిపడేసింది. నౌపడ నుంచి టెక్కలి వెళ్లే రహదారిలో ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. అటుగా వెళ్లేవారంతా తమ సెల్ ఫోన్ల కెమెరాతో ఫొటోలు తీశారు.

– ప్రజాశక్తి, సంతబొమ్మాళి



నౌపడ- టెక్కలి రోడ్డులో ఎరుపు రంగులో ఆకాశం

అన్నదాతకు బీమా భారం

- రైతులే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాల్సిన పరిస్థితి
- పలురకాల పంటలకు ప్రీమియం నిర్ణయించిన ప్రభుత్వం
- జిల్లా రైతాంగంపై రూ.33.20 కోట్ల భారం

రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఒకవైపు చెప్తూనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిపై భారం వేసేందుకు వెనుకాడటం లేదు. టిడిపి కూటమి ప్రభుత్వం పలురకాల పంటలకు రైతుల నుంచే ఇన్సూరెన్స్ ప్రీమియం వసూలు చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. విత్తనాలు, ఎరువులు దొరక్క బహిరంగ మార్కెట్‌లో అదనపు ధరలకు కొంటున్న రైతులకు ప్రీమియం రూపంలో డబ్బులు చెల్లించాల్సి రావడం వారికి మరింత భారం కానుంది. గతంలో ప్రభుత్వాలే పంటలకు ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పించాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి, కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాలు ఈ భారాన్ని రైతులపై వేయడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోయిన రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో కలిసి ప్రధానమంత్రి ఫసల్ బీమా (పిఎంఎఫ్‌బివై), పునర్నిర్మించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలను (ఆర్‌డబ్ల్యుబిసిఐఎస్) అమలు చేస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో దిగుబడి ఆధారిత పిఎంఎఫ్‌వైబి కింద వరి, మిర్చి, మొక్కజొన్న, పెసర పంటలను, ఆర్‌డబ్ల్యుబిసిఎస్ కింద పత్తి పంటలను గుర్తించాయి. వరికి గ్రామం యూనిట్‌గా, మండలం యూనిట్‌గా మిర్చి, జిల్లా యూనిట్‌గా మొక్కజొన్న, పెసర పంటలను ఎంపిక చేశాయి. టాటా ఎఐజి ఇన్సూరెన్స్ కంపెనీ ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలను ఎంపిక చేశారు. రైతులు, కౌలు రైతులు బీమా సౌకర్యానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లా రైతాంగంపై రూ.33.20 కోట్ల భారం

ఈ ఏడాది ఖరీఫ్‌లో 3,76,773 ఎకరాల్లో వరి పంట సాగు లక్ష్యంగా నిర్ణయించారు. అదేవిధంగా 23,873 ఎకరాల్లో మొక్కజొన్న, 3,125 ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేశారు. మొక్కజొన్న 23,873 ఎకరాలు, రాగులు 43 ఎకరాలు వేయనున్నారు. పప్పుధాన్యాలకు సంబంధించి కంది, పెసర, మినప పంటలను కలిపి మొత్తం 388 ఎకరాల్లో రైతులు సాగు చేసే అవకాశముందని అంచనా వేశారు. వేరుశనగ 433 ఎకరాలు, నువ్వులు 30 ఎకరాల్లో సాగవుతుందని భావిస్తున్నారు. పత్తి 3,125 ఎకరాల్లో, గోగు పంట 98 ఎకరాల్లో సాగు చేయనున్నారు. చెరుకు 2,623 ఎకరాల మేర సాగయ్యేలా ప్రణాళికలు రూపొందించారు. ఇన్సూరెన్స్ ప్రీమియం కింద రెండు శాతం చొప్పున వరికి ఎకరాకు రూ.850 (హెక్టారుకు రూ.2,125), పెసరకు రూ.360 (హెక్టారుకు రూ.900), పత్తికి ఎకరాకు రూ.900 చొప్పున రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మొక్కజొన్నకు ఒక శాతం చొప్పున ఎకరాకు రూ.370 చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన జిల్లా రైతులపై మొత్తం రూ.33.20 కోట్ల పైన భారం పడనుంది.

ఇన్సూరెన్స్ కంపెనీల కోసమేనా?

ప్రభుత్వం రైతుల తరుపున ప్రీమియం చెల్లించే బాధ్యత నుంచి తప్పుకుని ఇన్సూరెన్స్ కంపెనీలకు మేలు చేసేలా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులు చెల్లిస్తున్న ప్రీమియం డబ్బంతా కంపెనీలకే చేరనుంది. తుపాన్లు, వరదలు సంభవించే సమయంలో ఏదో కొద్దిమంది రైతులకు బీమా డబ్బులు చెల్లించి చేతులు దులుపుకుంటున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. విపత్తులు లేకపోతే ఒక్క పైసా కూడా చెల్లించనవసరం లేదు. ఉదాహరణకు జీడి పంటకు రైతులతో ఇన్సూరెన్స్ కట్టించుకున్న ప్రభుత్వం, జీడి పంటకు తెగులు సంభవించి రైతులు నష్టపోయినా ఎవరికీ ఒక్క పైసా ఇవ్వలేదు.

5న సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు

- విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి – శ్రీకాకుళం సిటీ

విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని కోరుతూ ప్రజాసంఘాలు, సంస్థలు ఇచ్చిన పిలుపుమేరకు ఆగస్టు ఐదో తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయాల వద్ద ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన సిపిఎం జిల్లా విస్తృత సమావేశంలో వారు మాట్లాడారు.

ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండని యువగళం పాదయాత్రలో లోకేష్ పిలుపునిచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజలను తీవ్రంగా దోపిడీ చేయడానికి పూనుకుంటున్నారని విమర్శించారు. టైమ్ ఆఫ్ ది డే విధానం పేరుతో పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు... సాయంత్రం 6 గంటల నుంచి పది గంటల వరకు మరో రేటు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎన్నికలకు ముందు టిడిపి కూటమి కరెంటు ఛార్జీలు పెంచబోమని హామీనిచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.

దక్షిణాదిలో కేరళ, బెంగాల్, తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాయన్నారు. దశల వారీగా ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్ బిగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు ఇచ్చాయన్నారు. ఇది మీటర్ మార్పు మాత్రమే కాదని, విధానం మార్చే కుట్ర ఇందులో ఇమిడి ఉందని తెలిపారు. విద్యుత్ రంగాన్ని బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రైవేటీకరణకు ఇది ఒక మెట్టు అని, దీని పేరే ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ అని అన్నారు. ప్రజల కళ్లు కప్పి 93 నెలల్లో వాయిదాల పద్ధతిలో కరెంటు బిల్లుతో పాటు వసూలు చేస్తారని చెప్పారు. రాష్ట్రంలోని రెండు కోట్ల మీటర్లకు సుమారు రూ.25 వేల కోట్ల భారం జనం నెత్తిన పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం స్వతంత్ర బలం పెరగడానికి కృషి చేయాలని తెలిపారు. ముందుగా కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్ అచ్యుతానందన్ మృతికి సంతాపం తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, కె.మోహనరావు, పి.తేజేశ్వరరావు, జి.సింహాచలం, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.షణ్ముఖరావు, సిహెచ్.అమ్మన్నాయుడు, ఎస్.ప్రసాదరావు, పి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

గరీబుల గెడ్డ లో నీటిని విడుదల చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి డివిజన్‌లోకి నందిగాం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి – సంతబొమ్మాళి

నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్‌లోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మండలంలోని వడ్డివాడ, జొన్నలపాడులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివద్ధి, సంక్షేమం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి వివరించారు. అంతకముందు రూ.35 లక్షలతో వడ్డివాడలో గరీబులగెడ్డలో నీటిని విడుదల చేశారు. గరీబుల గెడ్డ క్రాప్ రెగ్యులేటర్ మరమ్మతులు, కాకరాపల్లి కాలువ ఆధునీకరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు రెండో తేదీ నుంచి 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా రాష్ట్రంలోని 54 లక్షల మంది రైతులకు ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. కేంద్రం అందించే రూ.రెండు వేల సహాయంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.ఐదు వేలు కలిపి మొత్తం రూ.ఏడు వేలు తొలి విడతగా అందించనున్నట్లు చెప్పారు. రెండో విడతలో మరో రూ.ఏడు వేలు, మూడో విడతలో రూ.ఆరు వేలు అందిస్తామన్నారు. వచ్చే నెల నుంచి స్పౌస్ కోటాలో వితంతువులకు కొత్త పింఛన్లు అందిస్తామని తెలిపారు. రైతులు డ్రోన్ల సాయంతో మందులు పిచికారీ చేయించుకోవాలని సూచించారు.

యూరియా, డిఎపి ఇతర ఎరువులను అనధికారికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో రూ.600 కోట్లతో ఇంటింటికీ తాగునీరందిస్తామన్నారు. ప్రస్తుతం టెండరు దశలో పనులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు జీరు భీమారావు, నాయకులు రెడ్డి అప్పన్న, కూచెట్టి కాంతారావు, పి.శ్రీను, ఎంపిటిసి సభ్యులు మెండ త్రినాథ్, సుగ్గు శాంతిస్వరూప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాలతో డిఎస్‌పి అంత్యక్రియలు

ప్రజాశక్తి – పోలాకి

తెలంగాణ రాష్ట్రం యాదాద్రి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని డోలకు చెందిన డిఎస్‌పి జల్లు శాంతారావు అంత్యక్రియలను అధికార లాంఛనాలతో ఆదివారం నిర్వహించారు. డోల గ్రామానికి చెందిన గ్రామస్తులు, యువత పెద్దసంఖ్యలో నరసన్నపేట చేరుకున్నారు. శాంతారావు మృతదేహం నరసన్నపేట చేరుకోగానే, సత్యవరం జంక్షన్ వద్ద భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అక్కడ్నుంచి భౌతికకాయం ఉన్న వాహనంతో పాటు బైక్ ర్యాలీగా గ్రామానికి చేరుకున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు హాజరై భౌతికకాయానికి నివాళ్లర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి అధికారిక లాంఛనాల నడుమ కుటుంబసభ్యులు అంత్యక్రియల ప్రక్రియను పూర్తి చేశారు. డిఎస్‌పి స్థాయిలో ఉన్నా అందరితో చనువుగా ఉంటూ మంచి పేరు తెచ్చుకున్న శాంతారావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సాధారణ రైతు కుటుంబానికి చెందిన శాంతారావు చిన్నతనం నుండే పోలీసు ఉద్యోగంపై మక్కువతో అనుకున్నది సాధించారు. 1992లో ఎపిఎస్‌పిలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించారు. 1996లో ఎస్ఐ పరీక్షకు ఎంపికై కొండాపూర్ లో విధులు చేరారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సెక్యూరిటీ వింగ్ ఇంటెలిజెన్స్ డిఎస్‌పిగా ఆయన విధులు నిర్వహించారు. ఆయన భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

భౌతికకాయానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

స్మార్ట్‌మీటర్లతో ప్రజలపై భారం

- ప్రతిపాదనను విరమించుకోవాలి
- శ్రీకాకుళం టాక్స్ పేయర్ అసోసియేషన్

ప్రజాశక్తి – శ్రీకాకుళం సిటీ

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై ప్రభుత్వం అదనపు భారం మోపుతోందని శ్రీకాకుళం టాక్స్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి మణికొండ ఆదినారాయణమూర్తి విమర్శించారు. దీన్ని ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. నగరంలోని ఒక కళ్యాణ మండపంలో 'స్మార్ట్ మీటర్లపై చర్చ – కార్యాచరణ' సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ వల్ల అనేక నష్టాలు ఉన్నాయన్నారు. సింగిల్ ఫేస్ మీటర్ రూ.8,927, త్రీఫేస్ మీటర్ రూ.17,286కు కొనుక్కోవాలని తెలిపారు. ఈ మొత్తం 93 వాయిదాల్లో వినియోగదారుల నుంచి బిల్లు ద్వారా వసూలు చేస్తారని చెప్పారు. మీటరు జీవితకాలం ఆరున్నర సంవత్సరాలు మాత్రమేనని, తర్వాత మళ్లీ కొనుక్కోవాలని తెలిపారు. ఇప్పటికే వినియోగదారుల వేలాది రూపాయల డిపాజిట్ సంస్థ వద్ద ఉందని, మళ్లీ కొనుక్కోమనడం సరికాదన్నారు. ప్రస్తుత విధానంలో కరెంటు వాడిన తర్వాత బిల్లు వస్తుందన్నారు. ప్రతిపాదిత ప్రీపెయిడ్ విధానంలో సెల్‌ఫోన్ తరహాలో ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జి చేయించుకోవాలని, అప్పుడే కరెంటు వస్తుందని తెలిపారు. ముందు రూ.500 తగ్గకుండా బ్యాలెన్స్ వేయించుకోవాలని, బ్యాలెన్స్ అయిపోగానే మళ్ళీ డబ్బు చెల్లించి రీఛార్జి చేయించుకోవాలన్నారు. లేకుంటే కరెంటు నిలిచిపోతుందని, చీకటే గతి అని అన్నారు. సాంకేతిక కారణాల వల్ల మీటరు పనిచేయకపోయినా కరెంట్ ఆగిపోతుందన్నారు. 'టైమ్ ఆఫ్ డే టారిఫ్' విధానంతో సమయం బట్టి యూనిట్ ఛార్జీలు మారుతాయని తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మొత్తం పంపిణీ వ్యవస్థ విద్యుత్ స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు, బిల్లు వసూలు మొత్తం వ్యవస్థ ప్రైవేట్ సంస్థల ఆధీనంలోకి వెళ్లిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ అందరికీ అవసరమని, సేవా దృక్పథంతో ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి గానీ లాభార్జన సరికాదన్నారు. స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న టాక్స్ పేయర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కనీస వేతనం అమలు చేయాలి

నినాదాలు చేస్తున్న స్కూల్ శానిటరీ వర్కర్లు

ప్రజాశక్తి – పొందూరు

స్కూల్ శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని పాఠశాల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. పాఠశాల, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సమావేశం స్థానిక నెహ్రూ పార్కు వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్ శానిటేషన్ కార్మికులను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్లౌజులు, మాస్కులు ఇవ్వాలని, సరిపడా పనిముట్లు అందించాలని కోరారు. శానిటేషన్ కార్మికులకు నెలవారీ జీతాలు సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా ఐదో తేదీ లోగా వేతనం చెల్లించాలని కోరారు. వేసవి సెలవుల్లో పనిచేసినందుకు సగం వేతనం కాకుండా పూర్తి వేతనం ఇవ్వాలని కోరారు. హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా శానిటేషన్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ పొందూరు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎన్.పద్మ, ప్రధాన కార్యదర్శిగా కె.పార్వతి, కమిటీ సభ్యులుగా బి.రాజు, ఆర్.కోటమ్మ, ఎల్.లక్ష్మి, వై.కృష్ణవేణి, ఆర్.ఝాన్సీ, ఎం.పూర్ణిమను ఎన్నుకున్నారు.

నిజాలు నిగ్గు తేలేనా..?

నేడు డిఇఒపై విచారణ

ప్రజాశక్తి – శ్రీకాకుళం సిటీ

ఎచ్చెర్ల మండలం కుప్పిలిలో పదో తరగతి పరీక్షల సమయంలో 14 మంది ఉపాధ్యాయులు, సిబ్బందిని సస్పెండ్ చేసిన ఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల చైతన్యపై సోమవారం విచారణ చేపట్టనున్నారు. నగరంలోని సమగ్ర శిక్షా అభియాన్ కార్యాలయంలో విచారణ అధికారి, డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.వి శ్రీనివాసులు రెడ్డి ఆయన్ను విచారణ చేయనున్నారు. ఈ ఏడాది మార్చిలో పదో తరగతి ఇంగ్లీష్ పరీక్ష రోజున కుప్పిలి ఎ, బి సెంటర్లలో మాల్ ప్రాక్టీస్ ఆరోపణలతో ఐదుగురు విద్యార్థులను డిఇఒ తిరుమల చైతన్య డిబార్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ 14 మంది ఉపాధ్యాయులు, ఒక నాన్ టీచింగ్ సిబ్బంది మొత్తం 15 మందిని సస్పెండ్ చేశారు. ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఐదుగురు ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు కూడా పెట్టారు. డిఇఒ కక్షపూరితంగా వ్యవహరించారని ఆందోళనబాట పట్టిన ఉపాధ్యాయ సంఘాలు ఆయనపై ఫిర్యాదు చేశాయి. ఈ ఫిర్యాదు మేరకు ప్రభుత్వం డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.వి శ్రీనివాసులు రెడ్డిని విచారణ అధికారిగా నియమించింది. ఆయన సోమవారం ఉదయం 11 గంటలకు విచారణ చేపట్టనున్నారు. కుప్పిలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మావతికి సైతం విచారణకు హాజరు కావాలని ఇప్పటికే నోటీసులు ఇచ్చారు. రాష్ట్రస్థాయిలో తన పేరు ప్రతిష్టల కోసమే డిఇఒ ఉపాధ్యాయులను బలిపశువులను చేశారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో డిఇఒ తిరుమల చైతన్య ఉద్యోగ విరమణకు మూడు రోజుల ముందు చేపడుతున్న విచారణ పారదర్శకంగా సాగుతుందా, మొక్కుబడిగా ముగుస్తుందా అన్నది చూడాల్సి ఉంది.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

- గ్రామాల్లో సిబ్బంది నిరంతర పర్యవేక్షణ
- అందుబాటులో మందులు
- ముగ్గురికి మించి జ్వరం ఉంటే రక్త నమూనాలు సేకరణ
- ప్రతి శుక్రవారమూ డ్రై డే
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.అనిత



ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతుందని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.అనిత అన్నారు. గ్రామాల్లో మూడుకు మించి జ్వర పీడితులు ఉంటే గ్రామం మొత్తం సర్వే చేస్తున్నట్లు చెప్పారు. రక్త పరీక్షలు చేసి రోగ నిర్ధారణ చేస్తున్నట్లు వివరించారు. పారిశుధ్యం, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నీరు, ఆహార కలుషితం లేకుండా చర్యలు తీసుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చున అన్నారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి పలు అంశాలను వెల్లడించారు.

? వ్యాధుల నివారణకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాం. 84 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 732 గ్రామ సచివాలయాల పరిధిలో నిరంతరం క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. రోజూ గ్రామంలో ప్రజలు ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్నారు. సమస్య ఉంటే పిహెచ్‌సి వైద్యులు స్పందిస్తున్నారు.

? ఈ సీజన్‌లో ఎటువంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది?

వర్షాకాలంలో నీటి, ఆహార కలుషితం, దోమల వ్యాప్తి వల్ల పలు రోగాలకు అవకాశం ఉంది. డయేరియా, టైఫాయిడ్, పచ్చకామర్లు, చికెన్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులకు అవకాశం ఉంది. ఈ వ్యాధులు గుర్తిస్తే ప్రారంభంలో నియంత్రణలోకి తీసుకురావచ్చు.

? నీటి కాలుష్యం, పారిశుధ్యం వంటి అంశాలకు ఎటువంటి ప్రాధాన్యత ఇస్తున్నారు?

గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీరాజ్ శాఖలతో కలిసి పని చేస్తున్నాం. స్కీమ్స్ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు, బోరు బావులు నీటి నమోనాలు పరిశీలిస్తున్నాం. గ్రామాల్లో పారిశుధ్యం కోసం పంచాయతీల్లో స్పెషల్ డ్రైవ్ చేస్తున్నాయి.

? జ్వరాలు ప్రబలితే ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

గ్రామంలో ముగ్గురు జ్వర బాధితులు ఉంటే ప్రత్యేక చికిత్స చేస్తున్నాం. గ్రామం మొత్తం సర్వే నిర్వహించి రక్తనమోనాల సేకరిస్తున్నాం. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. గ్రామం యూనిట్‌గా జ్వరాలు అదుపులోకి వచ్చేవరకు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నాం.

? దోమల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ప్రతి శుక్రవారమూ డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. నీటి నిల్వలు లేకుండా చూస్తున్నాం. ప్రజలకు నీటి నిల్వ వల్ల నష్టాలు, దోమలు వ్యాప్తి చెందే విధానంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజల భాగస్వామ్యంతో దోమలు నియంత్రనకు కృషి చేస్తున్నాం. పంచాయతీల్లో ఫాగింగ్, దోమ నియంత్రణ ద్రావనాలు పిచికారీ వంటి చర్యలు తీసుకుంటున్నాం.

? ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

ఆహార పదార్థాలు తాజాగా వండినవి తినాలి. ఫ్రిజ్‌ల్లో పెట్టటం, నిల్వ చేయటం చేయకూడదు. డయేరియా వస్తే తక్షణం వైద్య సిబ్బందిని సంప్రదించాలి. ఒఆర్ఎస్ ద్రావణం తాగటం, వేడి నీళ్లు చల్లార్చి తాగడం వంటి వాటి వల్ల నియంత్రణ సాధ్యమవుతుంది.

? మందులు అందుబాటులో ఉంటున్నాయా?

సీజనల్ వ్యాధులకు సంబంధించి విలేజ్ క్లినిక్‌ల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అవసరం మేరకు మందులు సరఫరా చేస్తున్నాం. వైద్యులను ఎప్పటికప్పుడు నివేదిక కోరుతున్నాం. కుక్క కాటు, పాము కాటు వంటి వ్యాక్సిన్ల సైతం పిహెచ్‌సిల్లో అందుబాటులో ఉన్నాయి.

? ఆస్పత్రుల్లో ప్రసవాలపై ఎటువంటి అవగాహన కల్పిస్తున్నారు?

గ్రామస్థాయిలో క్షేత్రస్థాయి సిబ్బంది గర్భిణులకు ఆస్పత్రుల ప్రసవాలపై అవగాహన కల్పిస్తున్నాం. దీంతోపాటుగా డెలివరీ డేట్ నాటికి ఆస్పత్రుల్లో చేర్పిస్తున్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.

రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

రైతు శ్రేయస్సే ధ్యేయం

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వం ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో రైతు బజారుకు ఏర్పాటుకు ఆదివారం స్థలాన్ని పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ ఆకలి తీర్చే రైతన్నల బాగోగులను దృష్టిలో పెట్టుకొని రైతుబజారు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. జంట పట్టణాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నాయని, రైతుబజార్‌కు ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అందుకు తగిన కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపిటిపిసి ఛైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, పీరికట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ, మల్లా శ్రీనివాసరావు, చంద్రశేఖర త్యాడి, మలిపెద్ది నరేంద్రకుమార్, తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

నిలిచిన నీటి ధార

'ధార' ఆగింది

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని కె.కపాసుకుద్దిలో గత మూడు నెలలకు పైగా వృథాగా పోతున్న తాగునీటి 'ధార' ఆగింది. 'ధారా'ళంగా పోతున్నా.. పట్టించుకోరా అంటూ తాగునీటి వృథాపై ఇటీవల 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సంబంధిత అధికారులు తమ సిబ్బంది ద్వారా నీరు వృథా కాకుండా చర్యలు తీసుకున్నారు. అయితే తరచూ జరుగున్న లోపాలపై సంబంధిత ఉన్నతాధికారులను సంప్రదిస్తే స్థానిక సిబ్బంది సమన్వయ లోపంతో కొన్ని సమస్యలు ఏర్పడుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఇంటింటికీ పైపులైన్ వేస్తున్న సమయంలో చాలా ప్రాంతాల్లో గతంలో వేసిన పైపులైన్ కు దెబ్బలు తగిలి నీరు బయటకు రావడం కూడా జరుగుతోందని తెలిసింది. మొత్తంగా ఇటు మెగా ప్రాజెక్టు, అటు ఉద్దానం తాగునీటి పథకానికి చెందిన పాత, కొత్త సిబ్బందితో ఓ సమావేశం ఏర్పాటు చేసి స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని, ప్రతి గ్రామానికీ పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో ఆయా పోలీసు అధికారులు రౌడీషీటర్లు, సస్పెక్ట్, నేర చరిత్ర, చెడునడత కలిగిన వ్యక్తులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రామాలలో పాల్గోవడం చేయరాదని సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా మంచిగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపైనా పోలీస్ నిఘా ఉంటుందన్నారు. ఎవ్వరైనా, ఎక్కడైనా అనవసరపు గొడవలు, ఇతర నేరాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ఉద్దానంలో ఐక్యత వెల్లివిరియాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పచ్చని ఉద్దానం ప్రాంతంలో ఐక్యత వెల్లివిరియాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని పూండి- నౌపడ రహదారికి ఆనుకుని అమలపాడు వెళ్లే దారిలో గ్రామస్తులు రూ.20 లక్షలతో సర్వాంగ సుందరంగా ఏర్పటు చేసిన ముఖద్వారాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సదర్భంగా మాట్లాడుతూ ఉద్దానం అంటే గుర్తుకు వచ్చేలా ముఖద్వారం నిర్మాణం చేపట్టడం తనను ఆకర్షించిందన్నారు. జైకిసాన్.. జైజవాన్‌తో పాటు గ్రామంలోని ప్రతి ఆలయం ద్వారంపైనా ప్రతిబింబించేలా చక్కటి శిల్ప సౌందర్యం ఎంతో బాగుందన్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీని ఆమె అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గొరకల వసంతరావు, మాజీ సర్పంచ్ దున్న షన్ముఖరావు, పి.విఠల్‌రావు పాల్గొన్నారు.

యాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- నందిగాం

ఆగస్టు 3న కుప్పం నుంచి ప్రారంభం కానున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చల్లా రామారావు పిలుపునిచ్చారు ఈ మేరకు ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందిగాంలో మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగానికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన ఎస్‌సి వర్గీకరణ వల్ల మాలలకు తీవ్రమైన అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా సరైన జనాభా లెక్కలు లేకున్నా ఎంపిరికల్ డేటా లేకుండా వర్గీకరణ చేసిందన్నారు సుప్రీంకోర్టు సూచించినట్లు 59 ఉప తరగతుల్లో ఏ తరగతి వెనుకబడి ఉన్నాయో వాటిని అభివృద్ధిలోకి తీసుకురావడానికి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలన్నారు. కానీ, దళితుల మధ్య విభజన మాత్రం సరికాదన్నారు. కార్యక్రమంలో పి.ఢిల్లేశ్వరరావు, ఆర్.రామారావు, టి.పాపారావు, జె.బాబూరావు, పి.కృష్ణారావు, సిహెచ్.పద్మలోచన, బి.దుర్యోధనరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పం... నెరవేరని లక్ష్యం

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాకారమే లక్ష్యంగా గత టిడిపి హయాంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించినా ప్రయోజనం అంతంతమాత్రమే. ఇంటింటా సేకరించిన చెత్తను సేంద్రీయ ఎరువుగా మార్చాలని సంకల్పించినా ఆ దిశగా పూర్తిస్థాయిలో అడుగులు పడటం లేదు. గత ఐదేళ్లలో జగన్ సర్కారు వీటి గురించి కనీసం పట్టించుకోలేదు. సమస్యపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి కేంద్రాలను వినియో గంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.పాతపట్నం నియోజకవర్గంలో 150 పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 124 పంచాయతీల్లో ఉపాధి హామీ నిధులతో కేంద్రాలు నిర్మాణాలు చేపట్టారు. దాదాపుగా అన్నిచోట్లా ప్రారంభించారు. కానీ, పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాలేదు.మెళియాపుట్టి మండలంలో కొత్తూరు, ఆంపురం, గొట్టిపల్లి, మారడికోట, ఎస్.కొలిగాం తదితర పంచాయతీల్లో నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. మెళియాపుట్టి, వెంకటాపురం, జాడుపల్లి పంచాయతీలో

నిరుపయోగంగా సంపద సృష్టి తయారీ కేంద్రం

పునాది స్థాయిలో ఉన్నాయి. మెళియాపుట్టి మండలంలో 37 పంచాయతీలు ఉండగా, 28 పంచాయతీల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. 9 కేంద్రాలు అసంపూర్తిగా ఉన్నాయి. పాతపట్నం మండలంలో 34 పంచాయతీలు ఉన్నాయి. 30 పంచాయతీల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. కొత్తూరు మండలంలో43 పంచాయతీలు ఉన్నాయి. 35 నిర్మాణాలు పూర్తయ్యాయి. 8 అసంపూర్తిగా ఉన్నాయి. హిరమండలం మండలంలో 23 పంచాయతీలు ఉన్నాయి. 17 పంచాయతీల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. 6 పంచాయతీల్లో అసంపూర్తిగా ఉన్నాయి. ఎల్ఎన్‌పేటలో 22 పంచాయతీలు ఉన్నాయి. 14 పంచాయతీల్లో నిర్మాణాలు పూర్తయ్యాయి. 8 పంచాయతీల్లో అసంపూర్తిగా ఉన్నాయి. ఎల్ఎన్‌పేట మండలంలో మిరియాపల్లి, బొత్తాడసింగి, తాయిమాంబపురం, మోదుగు వలస, శ్యామలాపురం ఆర్‌ఆర్ కాలనీల్లో స్థల కేటాయింపు చేపట్టలేదు. హిరమండలం పరిధిలో రెండు చోట్ల పనులు ప్రారంభించలేదు. సుభలయ, ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆర్‌ఆర్ కాలనీ, తుంగతంపర, పెద్దగూడ పంచాయతీల్లో స్థల సేకరణ చేపట్టలేదు. పాతపట్నం మండలంలోని ఐదు పంచాయతీల్లో నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. కొత్తూరు మండలంలోని గురండి, కురిగాం, మహార్తాపురం పంచాయతీల్లో పనులు పూర్తికా లేదు. ఇరపాడు, గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీ, కాకరగూడ, మదనాపురం, మెట్టూరు, మెట్టూరు బిట్-2 ఆర్‌ఆర్ కాలనీ, నివగాం గ్రామ పంచాయతీల్లో స్థల సేకరణ చేపట్టలేదు.

త్వరలో వినియోగంలోకి తెస్తాం

ఇటీవల కలెక్టర్ సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు త్వరలో కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఈ సమాచారాన్ని ఎంపిడిఒలకు, ఇఒపిఆర్‌డిలకు తెలియజేశాం.

- ఐ.వి.రమణ, డిఎల్‌పిఒ, టెక్కలి

జాబితా విడుదల

టెక్కలి : పాలిటెక్నిక్‌లో ప్రవేశం నిమిత్తం రెండో విడత జాబితా ఎట్టకేలకు ఆదివారం విడుదలైంది. వారం రోజులుగా విద్యార్థులకు నిరాశకు గురిచేసిన జాబితా విడుదల్లో ఏర్పడిన అలక్ష్యంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసహనాన్ని వ్యక్తం చేశారు. అయితే సాంకేతిక విద్యాశాఖ తన వెబ్‌సైట్‌లో ఆదివారం జాబితా విడుదల చేస్తామని ఉదయం ప్రకటించి... మధ్యాహ్నానికి విడుదల చేయడంపై అపోహలను విడిచిపెట్టారు. అయితే ఆదివారం జాబితా విడుదల చేసి సోమవారం నుంచే ప్రవేశాలు పొందాలని తేదీలు జారీ చేయడంతో ఇది ఎలా సాధ్యమని వాపోతున్నారు. ప్రవేశాల గడువు పెంచాలని కోరుతున్నారు. ఏదేమైనా రెండో విడత ప్రవేశాల ఎంపిక ఎట్టకేలకు విడుదల చేయడంపై అభినందిస్తున్నారు.

చంద్రబాబుతోనే ఉత్తరాంధ్ర నేతలకు గౌరవం

ప్రజాశక్తి- కవిటి

సాధారణ కార్యకర్త కలిశెట్టి అప్పలనాయుడు ఎంపీగా, కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినా, గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు బాధ్యతలు స్వీకరించినా అది ముఖ్య మంత్రి చంద్రబాబు దూరదృష్టి, ఉత్తరాంధ్ర నేతలపై ఉన్న నమ్మకమే కారణమని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఒక ప్రకటనలో అన్నారు. టిసిఎస్, కాగ్నిసెంట్, గూగుల్ డేటా సెంటర్లు విశాఖ తరలిరావడమే కాకుండ ఐటి సెజ్, ఎన్‌టిపిసి గ్రీన్, భోగాపురం ఎయిర్‌పోర్టు, విశాఖ రైల్వే జోన్ ఒక్క ఏడాదిలోనే సాధించినట్టు తెలిపారు. గతంలోకి వెళ్లినా, ప్రస్తుతం చూస్తున్నా ఉత్తరాంధ్ర జిల్లాలపై, ప్రజలపై చంద్రబాబునాయుడు చూపిస్తున్న అభిమానం దేనికీ సాటిరాదని స్పష్టం చేశారు.

నరసన్నపేట : శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడుని శాసనసభ శాసనమండలి సంయుక్త కమిటీలను ఏర్పాటుపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

పలాస : చంద్రబాబు సారథ్యంలోనే ఉత్తరాంధ్ర నేతలకు గౌరవం లభిస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులను ప్రోత్సహించడంలో టిడిపి ముందుంటుందని, ఉత్తరాంధ్ర పరిశ్రమల అభివృద్ధికి సుజల స్రవంతి పథకానికి నిధులు కేటాయించారన్నారు.

సత్కారం అందుకుంటున్న చిద్విలాషిని

చిద్విలాషినికి సత్కారం

పలాస: విశాఖపట్నం శుభం ఫంక్షన్ హాల్ లో 36 ప్రపంచ రికార్డులు సాధించిన శ్రీశ్రీ కళావేదిక 150 వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో పలాసకు చెందిన కళాకారులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి మనుమరాలు తెప్పల చిద్విలాషిని రెండు శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించి వేదిక ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ మహిళా అధ్యక్షులు ఈశ్వరీభూషణం, చిట్టి లలిత, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పార్థసారథి, జిల్లా అధ్యక్షులు రామ జగన్నాథ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నారు.

అవార్డును అందుకుంటున్న కవి రాజారావు

'కుప్పిలి'కి అవార్డు

ఆమదాలవలస: ఆర్ట్ ఫౌండేషన్ నిర్వహించిన అమరావతి సాంస్కృతిక ఉత్సవంలో పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత కుప్పిలి వెంకటరాజారావు రాష్ట్రస్థాయి గుర్తింపు పొందారు. ఆయన రచించిన 'నవ్యాంధ్ర పసిడి కల' అనే కవితను కవి సమ్మేళన వేదికపై పఠించి శ్రోతలను మెప్పించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు, కళారత్న పొట్లూరి హరికృష్ణ చేతులమీదుగా కుప్పిలి సత్కారం పొందారు. ఈ రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనం ఆదివారం విజయవాడ బుక్ ఫెస్టివల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కవిత్వానికి నిబద్ధంగా సమాజానికి సందేశాత్మక రచనలు అందిస్తున్న వెంకటరాజారావు ఈ అవార్డుతో మరింత ప్రజాదరణ పొందారు.

కె.ఎస్ పురంలో పూడికతీత పనులు

లావేరు: లావేరు పంచాయతీ పరిధిలోని కేశవరాయుని పురం, లావేటిపాళెం గ్రామాల్లో కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభించారు. గత కొన్నాళ్లుగా కాలువల్లో పూడి కలు తీయకపోవడంతో దోమలు, ఈగలతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. కాలువల్లో పూడికలు, చేతిపంపులు, కుళాయిల వద్ద శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లాలని, దోమల వృద్ధితో సతమతమవుతున్నామని, దోమలు నివారణకు ఫాగింగ్ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాలువల్లో తీసిన పూడికలు

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

ఇచ్ఛాపురం : ప్రజలకు వివరిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ విజయ

ఇచ్ఛాపురం : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ విమర్శించారు. మండలంలోని కృష్ణాపురంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వైసిపి నాయకులు నర్తు ప్రేమ్‌కుమార్, పాతర్ల రాజశేఖర్‌రెడ్డి, బతకల మోహన్‌దాస్ పాల్గొన్నారు.

టెక్కలి: కూటమి ప్రభుత్వ పాలన బండారం ఏడాదిన్నరలోనే బండారం బయటపడిందని టెక్కలి జడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని అక్కవరం, బొప్పాయిపురం పంచాయతీ పరిధిలోని శ్యామ్‌సుందరాపురం, చల్లపేట గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వ పాలనలో అందుకున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. తల్లికి వందనం పేరుతో అసలైన లబ్ధిదారులను విడిచిపెట్టారన్నారు. నిబంధనల పేరుతో పథకాలు అందకుండా నిలిపివేశారని తెలిపారు. అన్ని రంగాల్లోనూ విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పొట్నూరు భూలక్ష్మి, అప్పలనాయుడు, గుజ్జు మోహన్‌రెడ్డి, కె.కామేశ్వరరావు, ఆట్ల రాహుల్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: సిఎం చంద్రబాబు నాయుడు మోసాలు, అబద్ధపు హామీలతోనే అధికారం చేపట్టారని వైసిపి రూరల్ మండల అధ్యక్షుడు చిట్టి జనార్ధన అన్నారు. మండలంలోని నైరా, లంకాం, సింగుపురంలో బాబూ ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చంద్రబాబు నాయుడు ప్రజలకు చేసిన మోసాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు చేస్తున్న వంచనను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చిట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : మాట్లాడుతున్న జెడ్‌పిటిసి వాణి

సామంతులకు సముచిత స్థానం

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

బాధ్యతలు చేపడుతున్న బాసుదేవ్ ప్రధాన్

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సామాజిక సమీకరణాల నేపథ్యంలో అన్ని తరగతులకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని, అందులో భాగంగానే సామంతులకు సముచిత స్థానం కల్పిస్తూ ఎర్ర బాసుదేవ్ ప్రధాన్‌కు పిఎసిఎస్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించినట్లు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తెలిపారు. పిఎసిఎస్ అధ్యక్షునిగా ఎర్ర బాసుదేవ్ ప్రధాన్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు రూ.28 లక్షల రుణాలు మంజూరు చేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో విప్ మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో ఎంతో వెనుకబాటుకు చెందిన సామాజిక తరగతికి చెందిన సామంతులను బిసిల్లో చేర్చేందుకు కీర్తిశేషులు ఎర్రన్నాయుడు, తన తండ్రి బెందాళం ప్రకాష్ అప్పటి ప్రధాని వాజపేయిని కలిశారని అన్నారు. సామంతుల స్థితిగతులు తెలియజేసి వారిని బిసి జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తే, ఇప్పటి తరంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, తాను కలిసి వారికి అన్ని విధాలుగా అవకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. కనీసం తాగేందుకు నీళ్లకూడా లేని అనేక సామంత గ్రామాలకు ఉద్దానం నీటి ద్వారా తాగునీరు అందించిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. టిడిపి ఆవిర్భావం నుంచి తమకు అండగా నిలుస్తున్న సామంత తరగతి భవిష్యత్‌లోనూ అదే ఆదరణ చూపిస్తూ తమకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, ఎఎంసి అధ్యక్షుడు మణిచంద్రప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, నాయకులు బెందాళం రమేష్, సీపాన వెంకట రమణ, ఆరింగి మధు, బెందాళం తిరుమల కుమార్, కొర్రా యి వాసుదేవ్, బాసుదేవ్ రౌళో, శ్రీనివాస్ రౌళో, ఆరింగి త్రివిక్రమరావు, పుల్లట సంతోష్, పుల్లట రాజు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సేవలు మరువలేనివి

పొందూరు: సచివాలయ ఉద్యోగులు అందించిన సేవలు మరువలేనివని తాడివలస సర్పంచ్ తమ్మినైన మణెమ్మ అన్నారు. మండలం తాడివలస సచివాలయంలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను ఆదివారం ఘనంగా సత్కరించారు. సచివాలయంలో వివిధ హోదాల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన బొడ్డేపల్లి వినుషా, గురుగుబెల్లి గాయత్రి, పైడి మౌనిక, బొడ్డేపల్లి లావణ్య, పేడాడ జోత్స్న, పైడి కాంతారావులను దుశ్శాలువ, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ తిర్లంగి చలపతిరావు, సర్పంచి ప్రతినిధి తమ్మినైన వెంకట జగన్నాథరావు, మాజీ సర్పంచ్ తమ్మినైన వాసుదేవరావు, పంచాయతీ ఇఒ మోహనబాబు, గోరింట సర్పంచ్ ప్రతినిధి చింతాడ కృష్ణ వాసుదేవరావు, తాడివలస నీటి సంఘం అధ్యక్షుడు దానేటి సత్యన్నారాయణ, మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ సీపాన భాస్కరరావు, టిడిపి నాయకులు తమ్మినైన పూర్ణారావు, ఎస్ఎంసి వైస్ ఛైర్మన్ అమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను సన్మానిస్తున్న సర్పంచ్, కార్యవర్గ సభ్యులు

'అమ్మోజీ'కి సత్కారం

అమ్మోజీని సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

రణస్థలం: సాహిత్యం, సేవా కార్యక్రమాల్లో విశేషంగా రాణిస్తున్న మహిళా పోలీస్ అమ్మోజీని ఆదివారం విశాఖపట్నంలో ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్, విశ్వభారత్ డైరెక్టర్ బలివాడ రమేష్, శ్రీనాథుని వంశస్తుల చేతులమీదుగా ఆమె ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. అమ్మోజీ రణస్థలం మండలంలోని సంచాం సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వహిస్తున్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని బైపల్లి మాజీ సర్పంచ్, రంగస్థల కళాకారుడు మడ్డు నాగేశ్వరరావు రాసిన పాత నుయ్యిలు కవితకు ప్రశంసలు దక్కాయి. విశాఖ పట్టణం జిల్లా కేంద్రంలో శుభం పంక్షన్ ప్రాంగణంలో శ్రీశ్రీకళా వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన కవి సమ్మేళనంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. నేటి సమాజంలో మంచి నీరు అందుబాటులో లేక, రానున్న కాలంలో మరింత ఇబ్బంది ప్రజలు పడుతున్న అంశాలపై కవిత రూపంలో ఆయన వినిపించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావుని ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్, జిల్లా అధ్యక్షుడు కొలచిన రామ జగనాథ్ జ్ఞాపిక, ప్రశంసపత్రం అందించి స న్మానించారు. ప్రవాసాంధ్ర ప్రజానాట్య మండలి ప్రముఖులు రుద్రమూర్తి, బాబూరావు అభినందనలు తెలిపారు.

హర్షవల్లి లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

హర్షవల్లి లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని, తక్కువ కాలంలో ఉన్నతమైన స్వచ్ఛంద సంస్థగా ఎదిగిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. హర్షవల్లి లయన్స్ క్లబ్ 2025 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహి ంచారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ సేవ చేసేవారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ పేద ప్రజలకు నిజమైన సేవలు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్నాయని అన్నారు. ప్రధానంగా ప్రజలకు ఉపయోగపడే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వావిలపల్లి జగన్నాథ నాయుడు మాట్లాడుతూ ప్రజాసేవ లక్ష్యంగా హర్షవల్లి లయన్స్ క్లబ్ పనిచేస్తుందని చెప్పారు. శ్రీకాకుళం ఆర్‌డిఒ సాయి ప్రత్యూష మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకి స్వచ్ఛంద సంస్థల సహాయ సహకారాలు అవసరమన్నారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా పట్టణంలోని ప్రముఖ వైద్యుడు డాక్టర్ మేడిశెట్టి సత్య స్వరూప్ బృందం ప్రమాణ స్వీకారం చేసింది. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని లైన్స్ ఇంటర్నే షనల్ మొదటి గవర్నర్ సుబ్బరాజు నిర్వహించారు. కార్యక్రమంలో రీజినల్ ఛైర్మన్ కృష్ణమోహన్, క్లబ్ ఎక్స్‌టెన్షన్ ఛైర్మన్ కెఎన్ఎస్‌వి ప్రసాద్, ప్రతినిధులు శోభారాణి, ఎస్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గం

తీరంలో వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ధనరాజు మృతదేహం

మండలంలోని నువ్వలరేవు తీరానికి ఆదివారం వ్యక్తి మృతదేహం చేరింది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవపంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులు అందజేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్కుపల్లికి చెందిన మడ్డ ధనరాజు ఈ నెల 20న ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి చేరలేదు. దీంతో కుటుంబ సభ్యులు ధనరాజు ఆచూకీ కోసం గాలించారు. కాగా, గత కొంత కాలంగా మతిస్థిమితంతో పాటు పిట్స్‌తో బాధపడుతున్న ధనరాజు ఇంటికి చేరుతాడు అనుకున్నారు. ఈ తరుణంలో సముద్రంలో కొట్టుకుపోయి నువ్వలరేవు తీరానికి మృతదేహం చేరింది. విషయం తెలుసుకున్న మృతుడు సోదరుడు వాసు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడు తల్లిదండ్రులు 18 ఏళ్ల క్రితం మృతి చెందంతో సోదరి హైమా వద్ద ఉంటున్నాడు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సంతబొమ్మాళి : మండలంలోని తాళ్లవలసకు చెందిన చల్ల మల్లేష్ ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మల్లేష్ నిత్యం మద్యం తాగుతూ ఉండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంతబొమ్మాళి ఎస్ఐ వై.సింహాచలం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్క దాడిలో 8 మందికి గాయాలు

ప్రజాశక్తి- బూర్జ

మండలం కొల్లివలసలో ఆదివారం పిచ్చికుక్క మూకుమ్మడిగా దాడిచేసి ఎనిమిది మందికి గాయాలు చేసింది. గాయపడిన మేడి వెంకటరమణ, చీర లక్ష్మీనారాయణ, గడే పార్వతి, టి.ఈశ్వరమ్మ, చెంప రమణ, పి.మల్లేశ్వరరావులను కంట్లాం గ్రామానికి చెందిన కొంతమంది గ్రామస్తులు వీరిని గుత్తావల్లి పిహెచ్‌సికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వారిని శ్రీకాకుళం రిమ్స్, పాలకొండ ఏరియా ఆస్పత్రికి పంపించినట్టు వైద్యులు రోజా తెలిపారు. పిచ్చికుక్కను పట్టుకోవడానికి సంబంధిత శాఖలకు సమాచారం అందజేసినట్టు గ్రామస్తులు తెలిపారు.

జూదరుల అరెస్టు

కొత్తూరు : మండలంలోని నీలకంఠాపురం కొండ ప్రాంతంలో వేర్వేరుగా పేకాట శిబిరాలపై ఆదివారం దాడి చేశామని ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ తెలిపారు. కొద్ది రోజులుగా పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ టీమ్ దాడి చేయగా, 9 మంది నుంచి రూ.78 వేలు, రెండు బైక్‌లు, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే వేరే ప్రదేశంలో దాడి చేయగా, నలుగురు నుంచి రూ.75 వేలు, కారు, బైక్ స్వాధీనం చేసుకున్నామని అన్నారు. వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. పేకాట శిబిరాలపై నిఘా పెట్టామని అన్నారు.

హరికృష్ణపై దాడి హేయమైన చర్య

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని గాజుల కొల్లివలస వద్ద నున్న సంగమేశ్వర స్వామి కొండ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. గత ముప్పై ఏళ్లుగా స్వామి వారి కొండ వద్దే నివాసం ఉంటూ అక్కడి పరిసరాలను కంటికి రెప్పలా కాపాడుతున్న గేదెల హరికృష్ణ కొండవద్ద జరుగుతున్న అక్రమాలు, మద్యం, గంజాయి సేవనాలు వంటి అనైతిక చర్యలను నిరంతరం మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయడంపై కొంతమంది వ్యక్తిగత కక్షలు పెంచుకుని దాడి చేయడం హేయమైన చర్య అని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఆమ్‌ఆద్మీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొడ్డేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల కొందరు మద్యం, గంజాయి సేవించిన వ్యక్తుల బృందం హరికృష్ణపై భౌతికదాడికి పాల్పడడం దురదృష్టకరమైన చర్యని, ఆయనపై దాడి చేసిన వారిని గుర్తించి వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే సంగమేశ్వర స్వామి కొండ పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు గట్టి నిఘా పెట్టాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమ డి-పట్టాను రద్దు చేయాలి

నినాదాలు చేస్తున్న యువకులు

ఆమదాలవలస: మండలంలోని చిట్టి వలస పంచాయతీకి చెందిన శీర పోలమ్మ పేరిట మంజూరు చేసిన అక్రమ డీ పట్టాను వెంటనే రద్దు చేయాలని చిట్టివలస గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఆదివారం చిట్టివలసకు చెందిన యువకులు గాజుల కొల్లివలస లేఅవుట్‌కు ఎదురుగా ఉన్న శీర పోలమ్మ డీ పట్టా భూమి వద్ద నిల్చుని రెవెన్యూ అధికారులు మంజూరు చేసిన అక్రమ డీ పట్టాను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ చిట్టివలస గ్రామ పరిధిలో సైలాడ రెవెన్యూ సర్వే నెంబర్ 183 కొండ ప్రాంతంలో ఉన్న భూమిని అర్హతలేని కొంత మంది ప్రైవేట్ వ్యక్తులకు 294, 295-2, 296-1, 296-3 కలిగిన తప్పుడు సర్వే నెంబర్‌లతో గతంలో పట్టాలు ఇచ్చారని, ఇప్పటికే ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, దీనిపై రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి డీ పట్టాను రద్దు చేయాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

ఆమదాలవలస: పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్ట నున్నట్లు వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ ఇఒ సిహెచ్ ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు దేవస్థానం వద్ద దేవదాయ శాఖ అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించుటకు నిర్ణయించినట్లు తెలిపారు.

'ఆహా' హోటల్ ప్రారంభం

నరసన్నపేట : నరసన్నపేట వైఎస్ఆర్ కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆహా హోటల్‌ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరసన్నపేటలో భవిష్యత్‌లో మంచి వ్యాపార కేంద్రంగా మారుతుం దన్నారు. వివిధ రకాలైన వ్యాపారాలు ప్రారంభం చేసిన వారు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ముందుగా వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ హోటల్‌ను సందర్శించారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

పొందూరు : తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

అర్హత ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందని టిడిపి క్లస్టర్ యూనిట్ ఇన్‌ఛార్జిలు కూన వెంకట సత్యనారాయణ, గాడు నారాయణరావులు అన్నారు. మండలంలోని సుపరిపాలన - తొలి అడుగు కార్యక్రమాన్ని కోటిపల్లి, మజ్జిలిపేట, పెనుబర్తి, గోరింట, తుంగపేట గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి టిడిపి ఏడాది పాలనపై సాధించిన విజయాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తమ్మినేని వేణుగోపాలం, చింతాడ శ్రీలక్ష్మి, చింతాడ కృష్ణ వాసుదేవరావు, నాయకులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యపడుతుందని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. మండలంలోని రొట్టవలసలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి తాడేల వెంకటరమణ, టిడిపి నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలన ఫలితాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బెవర రాజారావు, మూడడ్ల రామకృష్ణ, బెవర లక్ష్మణరావు, తొత్తడి వైకుంఠరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : పోస్టర్‌ను అందజేస్తున్న డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ

ఆమదాలవలస : పురపాలక సంఘంలోని 10వ వార్డులో సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమాన్ని టిడిపి సాధికారిత కమిటీ సభ్యుడు నాగళ్ల మురళీధర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టిడిపి నాయకులు కారుణ్య ధర్మారావు, గొల్లపల్లి సింహాద్రి, మునగవలస రవీంద్రబాబు, కుప్పిలి శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని గంగరాజుపురంలో తొలి అడుగు కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, మాజీ వైస్ ఎంపిపి భైరసింగి దినకర్, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, శంకర్, తామాడ భాస్కరరావు, జమ్మన భైరాగి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యువకులు

వీధి బల్బులు వెలగడం లేదు

ప్రజాశక్తి- కవిటి

కవిటి బెహరా వీధిలోని విద్యుత్ వైర్లు పాతవి కావడంతో తుప్పుపట్టి పాడై పోయాయని, దీంతో తరచూ విద్యుత్ సమస్యలు ఏర్పడడమే కాకుండా వీధిలో బల్బులు కూడా వెలగడం లేదని పలువురు బెహరా వీధికి చెందిన యువకులు వాపోయారు. ఈ మేరకు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయను ఆదివారం కలిసి తమ సమస్యలు ఏకరువు పెట్టి వినతిపత్రం అందించారు. ముఖ్యంగా రాత్రి సమయంలో బల్బు లేకపోవడంతో చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ సమస్యలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్తు లైను సరిచేయడమే కాకుండా పూర్తిస్థాయిలో బల్బులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ గౌతమ్ బెహరా, ఖగపతి బెహరా, గిరి బెహరా, త్రినాథ బెహరా, తదితరులు పాల్గొన్నారు.

ఎయు దూరవిద్య కోర్సులకు అడ్మిషన్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆంధ్రా యూనివర్శిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి గానూ డిగ్రీ, పిజి కోర్సుల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. బిఎ, బికాం, బిఎస్‌సి వంటి డిగ్రీ కోర్సులతో పాటు ఎంఎ, ఎంకామ్, ఎంఎస్‌సి వంటి పిజి కోర్సుల్లో అర్హత కలిగిన విద్యార్థులు సెప్టెంబర్ 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) ప్రిన్సిపాల్, అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ కె.శ్రీరాములు తెలిపారు. వివరాలు తెలుసుకోవాలనుకునే విద్యార్థులు శ్రీకాకుళంలోని ఎయు దూర విద్య అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

రోగులకు మందులను పంపిణీ చేస్తున్న మాజీ ఎంపిపి ప్రమీల

వైద్య శిబిరానికి స్పందన

ఆమదాలవలస: నియోజకవర్గంలోని మున్సిపాలిటీతో పాటు వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న భగవాన్ సత్యసాయి సేవాసమితి సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల అన్నారు. ఆదివారం పట్టణంలోని 7వ వార్డు చింతాడలో మెట్టక్కివలస సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కన్వీనర్ కన్నేపల్లి వెంకట కామావదానాలు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 100 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సత్యసాయి ప్రతినిధి డాక్టర్ పి.తాతయ్యలు పర్యవేక్షణలో ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ హేమంత్, చిన్న పిల్లల వైద్య నిపుణులు ఎస్‌సి రమేష్, దంత వైద్య నిపుణులు ఎం.పద్మ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి 70 మంది ఎముకల వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. అనంతరం వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి బిసిసెల్ కార్యదర్శి బోర గోవిందరావు, విశ్రాంత ఎంపిడిఒ ఎం.రవీంద్రబాబు, సత్యసాయి సేవాసమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

నిల్వ ఉన్న మురుగునీరు

మురుగునీరు దాటాల్సిందే...

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేటలో గాంధీ నగర్ నుంచి ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాలన్నా మురుగు నీరు దాటాల్సిందే. పోలాకి రోడ్డు నుంచి ఏ వాహనం వచ్చినా వాయిదాల గేటు నుంచి గాంధీ నగర్ మూడో లైన్ నుంచి నరసన్నపేట టౌన్ లోకి రావడం ప్రయాణికులకు అలవాటు. అయితే ఈ మార్గంలో ఉన్న సిసి రహదారిలో గొయ్యిలు ఏర్పడంతో వర్షం పడితే నీరు ఎటూ వెళ్లకుండా నీరు నిల్వ ఉండి మురుగు నీరు తయారై దుర్వాసన వస్తుంది. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారు. అను నిత్యం నీరు చేరడం వల్ల అపారిశుధ్యం ఏర్పడుతుంది. ఎన్నో ఏళ్ళుగా ఈ సమస్య ఉన్నా.. పట్టించుకునే నాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మురుగు నీటికి ఒక పక్క తహశీల్దార్ కార్యాలయం, మరోపక్క హెడ్‌పోస్టాఫీసు, ఎదురుగా పోలీస్‌స్టేషన్, వెనుక భాగంలో ట్రెజరీ కార్యాలయం, కొద్దిగా ముందుకు వెళ్తే కోర్టు, రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. కానీ, ఎవరూ పట్టించుకోవడం లేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్లను బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు

పరీక్షా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎచ్చెర్ల మండలం చిలకపాలెం శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ పరీక్షల నిర్వహణను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం పర్యవేక్షించారు. ఆదివారం నుంచి ఆగస్టు ఒకటి వరకు రెండు విడతలుగా ఈ పరీక్షలు ఇర్వహిస్తామని తెలిపారు. శివానీ కళాశాలలో నిర్వహించిన మొదటి రోజు పరీక్షకు మొత్తం 190 మంది అభ్యర్థులకు గాను, 163 మంది హాజరయ్యారు. ఈ పర్యవేక్షణలో ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ భోగేశ్వరి, పద్మప్రియ, హెచ్‌సెక్షన్ సూపరింటెండెంట్ జోగారావు ఉన్నారు. పరీక్షల నిర్వహణ తీరు, అందుబాటులో ఉన్న సాంకేతిక సౌకర్యాలు, పర్యవేక్షణ విధానాలపై డిఆర్‌ఒ సమీక్షించారు.

ఇసుక అక్రమ దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి - కొత్తూరు

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి డిమాండ్ చేశారు. మండలంలోని వసప ఇసుక ర్యాంపును ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసప వద్ద అక్రమంగా చేపడుతున్న ఇసుక తవ్వకాలు, నది మధ్యలో అడ్డుకట్టలు వేయడం వల్ల నది ప్రవాహ దిశ మారుతోందన్నారు. దీనివల్ల చుట్టుపక్కల గ్రామాలు వరదల బారిన పడి ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతుల పొలాల్లో రోడ్లు వేసి ఇసుకను తరలిస్తున్నారని చెప్పారు. అక్రమ తవ్వకాలను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, ఎంపిపి సవరి సావిత్రి, వైసిపి మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, ఎంపిటిసి వి.లక్ష్మీనారాయణ, వైసిపి నాయకులు ఆగతముడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తదితరులు

మత్తు పదార్థాలపై అవగాహన

మెళియాపుట్టి: డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సిఐ వి.రామారావు అన్నారు. మండలంలోని వసుంధర కూడలిలో ఆదివారం డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించారు. దీనివల్ల కలిగే నష్టాలను వివరించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే మోసాలపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పి.రమేష్‌బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ రామారావు

క్రీడాకారులతో రమణమూర్తి

చెస్‌లో ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

శ్రీకాకుళం: జిల్లా విద్యార్థులు చెస్ క్రీడలో నైపుణ్యం సాధించి, పోటీల్లో మంచి అవార్డులు గెలుపొంది ఉన్నత శిఖరాలు చేరుకోవాలని టిడిపి నగర బిసి సెల్ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి అకాంక్షించారు. నగరంలోని తిలక్‌నగర్ నర్సెస్ కాలనీలోని స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీలో ఓపెన్ చెస్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. చెస్ క్రీడాకారులు 5 రౌండ్లపాటు సాగిన పోటీల్లో ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో రమణమూర్తి మాట్లాడుతూ చదరంగం మేధావుల క్రీడ అని, అలాంటి క్రీడలో జిల్లా చిన్నారులు రాణిస్తుండడం శుభపరిణామమన్నారు. స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ సంస్థ 16 ఏళ్లుగా నగరంలో 202 చెస్ టోర్నీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీసాయి దుర్గా ట్యూషన్ సెంటర్ ప్రతినిధులు, స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ చెస్ కోచ్‌లు భేరి చిన్నారావు, కె.సాయి నిరంజన్ సింగ్, సీనియర్ చెస్ క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ప్రజా పరిష్కార వేదిక

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్జీదారుల అర్జీల నమోదు, స్థితి దానికి సంబంధించి సమాచారం గురించి తెలుసుకోవాలంటే 1100 నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అలవర్చుకోవాలి

ఆమదాలవలస: పోలీసులు ఫ్రెండ్లీ పోలీస్ తత్వాన్ని అలవర్చుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిఎస్‌పి వివేకానంద అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో ఆమదాలవలస, బూర్జ పోలీస్‌స్టేషన్‌ల నుంచి బదిలీపై వెళ్లిన పోలీసులకు ఆత్మీయ వేడుకలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేయాలని అన్నారు. ఉద్యోగి జీవితంలో బదిలీలు తప్పవని, విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు నిస్తాయన్నారు. బదిలీపై వెళ్లిన సిబ్బంది ఆయా స్టేషన్‌లలో విధి నిర్వహణలో రాణించి డిపార్ట్మెంట్‌కు మంచి పేరు తీసుకు రావాలని అన్నారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన ఎఎస్‌ఐ శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిఐ పి. సత్యనారాయణ, ఎస్‌ఐలు సనపల బాలరాజు, మొజ్జాడ ప్రవళ్లిక, సత్యనారాయణ, సీపాన కాంతారావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి